క్లుప్తంగా

సీఎంను కలిసిన 'చల్లా'



ఆత్మకూరు: సీఎం కేసీఆర్‌ను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిజాబితాలో తన పేరును ప్రకటించి మరోసారి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించారు.

దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దళితులు దళితబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో కోరారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సులోపు వారు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డు, ఓటరుకార్డు, ఆదాయం ధృవీకరణ పత్రాన్ని దరఖాస్తుతో పాటు ఏ యూనిట్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారో అందులో పొందుపర్చాలని తెలిపారు. కుటుంబంలో ఎవరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉన్నా వారు అనర్హులని తెలిపారు. అర్హత కలిగిన దళితులు ఈ నెల 24 వ తేదీ నుంచి సెప్టెంబరు 10 వ తేదీలోపు దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు కుమారస్వామి

ఎల్కతుర్తి: మండల కేంద్రంలో సోమవారం గౌడ సంఘం నూతన గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా గొడిశాల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా గొడిశాల రాజేష్, కార్యదర్శిగా రాజయ్య, సభ్యులుగా కందాల మొగిళి, బుర్ర రవి, గొడిశాల కుమారస్వామి, కొత్తకొండ కుమాస్వామి, గొడిశాల సుమన్, గొడిశాల విక్రమ్‌లు ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యకర్గ సభ్యులు తెలిపారు.

వైద్య శిబిరం ఏర్పాటు



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన చిన్నారి రోహిత (4) ఇటీవల విషజ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా సోమవారం వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 121 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి ఎంజీయం ఆస్పత్రికి పంపించనున్నట్లు వైద్యులు తెలిపారు. మిగతా గ్రామాల్లో సైతం వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు. వైద్య శిబిరాన్ని తహసీల్దార్ వెంకటభాస్కర్, పంచాయతీ కార్యదర్శి సాదిక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్, రాజశేఖర్, రహమాన్, రుబీనా వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'చల్లా'ను కలిసిన నాయకులు



ఆత్మకూరు: బీఆర్ఎస్ పరకాల ఎమ్మెల్యేగా అభ్యర్థిగా చల్లా ధర్మారెడ్డిని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించడంతో మండలంలోని బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్లు చింతం సదానందం, కాంతాల కేశవరెడ్డి, నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి, దుంపల బుచ్చిరెడ్డి, గండు రాము, రవీందర్, బిల్లా రమణారెడ్డి కలిసిన వారిలో ఉన్నారు.

ఇంటింటికీ బీజేపీ



ఆత్మకూరు: మహాజనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పెంచికలపేటలో బీజేపీ నాయకులు ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి పైడి, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, మండపెల్లి భాస్కర్, మంగ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఘనంగా 'గెల్లు' జన్మదినం

కమలాపూర్: రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బస్టాండ్ కూడలి వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల సంబురాలు

పరకాల : బస్టాండ్ కూడలిలో బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలిజాబితాను ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా గులాబీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక కూడళ్ల వద్ద బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. పరకాల ఎమ్మెల్యే అభ్యర్థిగా చల్లా ధర్మారెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా అరూరి రమేష్, భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా గండ్ర వెంకటరమణారెడ్డి, హుజూరాబాద్ అభ్యర్థిగా పాడి కౌశిక్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థిగా కడియం శ్రీహరి, హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వొడితెల సతీష్‌కుమార్‌ల పేర్లు ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు, అనుచరులు ర్యాలీలు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్ : బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



నడికూడలో..

శాయంపేటలో..





ధర్మసాగర్‌లో..



ఎల్కతుర్తిలో..



ఐనవోలులో..

కాంగ్రెస్‌లో చేరికలు..



మల్లన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

ఐనవోలు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో ఐనవోలు మండలానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాయపురం సాంబయ్య, ఐనవోలు 1, 13వ వార్డు సభ్యురాలు లలిత వెంకట నారాయణ, బుర్ర మమత సతీష్, మాజీ ఉప సర్పంచ్ మామునూరి నర్సయ్య, జనసేన మండలాధ్యక్షుడు ఎండీ రహీం ఖాన్‌తో పాటు ఏకలవ్య సంఘం, వివిధ సంఘాల నాయకులు సుమారు 200 మంది పార్టీలో చేరగా వారికి రేవంత్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. రేవంత్‌రెడ్డికి ప్రఖ్యాత ఐనవోలు మల్లన్న చిత్రపటంతో పాటు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సమ్మెట మహేందర్, మండల అధికార ప్రతినిధి కొత్తూరి సునీల్, మైనారిటీ అధ్యక్షుడు రహీంపాషా, ఐనవోలు, పున్నేలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బరిగల భాస్కర్, ఇల్లందుల సారయ్య, దోమకొండ హరీష్, మారుపట్ల రాజారామ్, ప్రతాప్, బొల్ల అశోక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు



ఎల్కతుర్తి : శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శాయంపేటలో..

ఎల్కతుర్తి: శ్రావణ సోమవారం సందర్భంగా మండల కేంద్రంతో పాటు భీమదేవరపల్లి మండలంలో నాగులపంచమి వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. తలంటుస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి సమీప ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో గల పుట్టకు పసుపు, కుంకుమలు చల్లి పూలతో అలంకరించారు. ఆవు పాలతో పుట్టలో పాలు పోసి పూలు, పండ్లు, నైవేద్యం నారికేలంలు సమర్పించారు. తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో విరజిల్లేలా చూడు నాగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. అనంతరం శివలింగాన్ని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు నందనం రవిశర్మ, మణికంఠ శర్మ, రోహిత్ శర్మ పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో గల నాగేంద్ర స్వామి ఆలయాల్లో నాగుల పంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోసి చల్లగా చూడు నాగులమ్మ అంటూ వేడుకున్నారు. తహరాపూర్ నాగేంద్ర స్వామి ఆలయంలో పుట్టను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీ శివమార్కండేయ,



పరకాలలో..

శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ ఆవరణంలోని నాగేంద్ర స్వామి ఆలయాల్లో అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, మార్త రాజుకుమార్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పరకాల: నాగుల పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల కోలాహలం నెలకొంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా భక్తులు రావిచెట్టు సమీపంలోని నాగేంద్రస్వామికి పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మతో పాటు ఆలయ ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం



పత్తిపాకలో నిర్వహించిన పల్లెనిద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

శాయంపేట : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తొలిజాబితాలో సీఎం కేసీఆర్ తన పేరును ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పత్తిపాకలో సోమవారం రాత్రి పల్లెనిద్ర చేసేందుకు వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ మేరకు సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటాలు, డిజే పాటలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో విభేదాలు లేవని, అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ హయాంలోనే నిరుపేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం, బీసీలకు కార్పొరేషన్ రుణాలు, అర్హులకు దళితబంధు పథకాన్ని అందించనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి ఇంట్లో పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందిస్తాం



సహపంక్తి భోజనం చేస్తున్న అస్సాం ఎమ్మెల్యే

కమలాపూర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే విద్య, వైద్యం పూర్తిగా ఉచితంగా అందిస్తామని అస్సాం రాష్ట్రంలోని సోనారి నియోజకవర్గ ఎమ్మెల్యే ధర్మేశ్వర్ కోన్వార్ తెలిపారు. ఎమ్మెల్యే పవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని దళిత వాడలో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకుని వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఈటల నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడం లేదని ఆరోపించారు. నరేంద్ర మోదీ సారథ్యంలో బలమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో భారతదేశం మూడో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీని గెలిపించాలని కోరారు. నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, కో కన్వీనర్ మాట్ల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, మండల సంస్థాగత ఇన్‌చార్జ్ గురుమూర్తి శివకుమార్, ప్రవాసయోజన కోఆర్డినేటర్ పుప్పాల రఘు, సంస్థాగత ఫుల్ టైమర్ సుధీర్, జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్ బాబు, నాయకులు ప్రవీణ్ శ్రీనివాస్, భిక్షపతి, సారంగపాణి, రత్నాకర్, శోభన్‌బాబు, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

దామెర: అసత్య ప్రచారాలు మానుకోవాలని మండలంలోని ఊరుగొండ సమీపంలోని తన వ్యవసాయ భూమికి సంబంధించిన వివాదంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న చల్లా శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గ్రామ శివారులోని సర్వేనంబర్ 103 లో తన భూమిలో సమీప రైతు కొటం అయిలయ్య సమ్మతితోనే ప్రహరీ నిర్మించినట్లు తెలిపారు. భూమిలో ఉన్న నాళా నుంచి వరదనీరు వెళ్లే ప్రదేశంలో ఐల్లయ్య ప్రహరిగోడను నిర్మించగా గత నెల కురిసిన భారీ వర్షాలకు వరదనీరు పోటెత్తడంతో ఐలయ్య నిర్మించిన ప్రహరీ గోడ ఊరుగొండ గ్రామపంచాయతీవారు తొలగించడంతో తనపై అరోపణలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా నిబంధనలు పాటించని వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ మల్లేష్, ఎస్సై ముత్యం రాజేందర్‌లు తెలిపారు. ఈ మేరకు సోమవారం డీఈ ఖాదర్‌తో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ప్రభుత్వ సర్వేయర్ ద్వారా కొలతవేయించి హద్దులు నిర్ణయించి తప్పు చేసిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ గండు సుదర్శన్, సనీల్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



ఆత్మకూరు: ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలో పోచమ్మతల్లి, శివాలయం ఆలయాలకు నూతన ద్వార ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల నిర్మాణంలో తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ డైరెక్టర్లు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, కంది శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ బొల్ల నరేష్, నాయకులు కాంతాల కేశవరెడ్డి, కక్కెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



కమలాపూర్: మండలంలోని శంభునిపల్లి, దేశరాజుపల్లి, ఉప్పులపల్లి, వెంకటేశ్వర్లపల్లి, మర్రిపల్లి, వంగపల్లి, మాదన్నపేట తదితర గ్రామాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులరైజ్ చేసే ప్రక్రియలో భాగంగా రికార్డుల తనిఖీ, నిర్వహణ, వారి పని తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రవీందర్‌రెడ్డి, రమేష్, ఉమ, లక్ష్మి, రజిత, కమలమ్మ, చరణ్‌పటేల్, ఎంపీడీఓ పల్లవి, ఎఫ్ఆర్ఓ మయూరి, స్థానిక ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎంపీఓ విమల, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, విజయ్‌కుమార్, సృజన, సాహిత్‌రెడ్డి, స్వప్నప్రియ, విద్యాసాగర్‌రెడ్డి, చైతన్య, ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, పంచాయతీ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

శాయంపేట : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా ఇంట్లో నిల్వ చేసిన రేషన్ డీలర్ కందగట్ల తేజవతిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ సోమవారం వెల్లడించారు. ఈనెల 16వ తేదీన అధికారుల అనుమతులు లేకుండా రేషన్ డీలర్ తేజవతి 27 క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని తన స్వంత ఇంటిలో నిల్వ చేయగా అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. సీజ్ చేసిన బియ్యం గదిని డీటీ సత్యనారాయణ పరిశీలించి బియ్యాన్ని సమీపంలోని మరో డీలర్ బాపురావుకు అప్పగించి ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఆహార భద్రత కార్డుదారులు ఏ రేషన్ షాపులోనైన బియ్యం పొందవచ్చని గోడపత్రిక అంటించారు. పోస్టాఫీస్‌లో తీసుకునేందుకు పోర్టబిలిటీ సౌకర్యం ఉందని రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సొమ్మును అక్రమంగా పొందినా, మభ్యపెట్టి స్వాదినం చేసుకున్నా స్థానికులు వెంటనే సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

అగ్రకుల పార్టీలను చిత్తుగా ఓడించాలి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పరకాల: అగ్రకుల పార్టీలను ఓడించి బడుగు, బలహీన వర్గాల ప్రజల పార్టీయైన ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ)ని గెలిపించుకుంటామని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి పూరెల్ల రమేష్ అన్నారు. డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు గత 30 రోజులుగా 60 మండలాల్లో 103 గ్రామాల మీదుగా 500 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకొని సోమవారం పట్టణానికి చేరుకున్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ అగ్రకూలల చేతిలో రాష్ట్రంలోని 93 శాతం బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు బందీగా మారారని అన్నారు. వారికి విముక్తి కల్పించేందుకు డీఎస్పీని అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బిరుదుల రాజేష్, పూలమాల రాజు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్, జిల్లా నాయకులు మేకల యుగేందర్, గోల్కొండ రాజేష్, నాగరాజు, ప్రతాప్, రవీందర్ ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కమలాపూర్: హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో సెప్టెంబర్ 3వ తేదీన నిర్వహించతలపెట్టిన పద్మశాలి శంఖారావం బహిరంగ సభను వియవంతం చేయాలని పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వన్నాల నరేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో సోమవారం బహిరంగ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని, వారిని అన్ని రంగాల్లో జనాభా దామాషా ప్రకారం ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలను హెచ్చరిస్తూ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పద్మశాలీలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్, జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొప్ప శివశంకర్, పొరండ్ల రమేష్, బైరి దశరథం, పులికంటి రాజేందర్, నాయకులు మార్గం భిక్షపతి, మిట్టపెల్లి ప్రభాకర్, కుమారస్వామి, పద్మశాలిలు తదితరులు పాల్గొన్నారు.

చోరీ నిందితుడి అరెస్టు..

దామెర: జల్సాలకు అలవాటుపడి చివరకు దొంగగామారి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని స్థానిక పోలీస్‌లు అరెస్టు చేశారు. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా, తొరంగి గ్రామానికి చెందిన పెంకే ప్రకాశ్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటుపడి 2009 సంవత్సరంలో దొంగతనం కేసులో జైలు శిక్ష అనుభవించి బయటికి వచ్చాడు. అప్పటి నుంచి పలుచోట్ల దొంగతనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16 వ తేదీ రాత్రి మండలంలోని కటాక్షపూర్‌లో బైక్, దామెర మండలంలోని తక్కళ్లపహడ్‌లో ఓ ఇంట్లోకి చొరబడి పలు వస్తువులు దొంగిలించేందుకు ప్రయత్నించాడు. దీంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమై కేకలు వేయడంతో దొంగ బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా సోమవారం నిందితుడు తిరిగి దొంగతనం చేసేందుకు బైక్‌పై వెళుతున్న క్రమంలో ఒగ్లాపూర్ సమీపంలోని దర్గా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రకాశ్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని ప్రశ్నించినట్లు తెలిపారు. పలుచోట్ల దొంగతనం చేసినట్లు ఒప్పుకోగా కోర్టులో పర్చినట్లు వెల్లడించారు. దీంతో కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాధితుడికి ఎల్ఓసీ అందజేత

హన్మకొండ: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందేందుకు ఆర్థిక స్తోమత లేని నిరుపేద దీనస్థితి తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్.. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీ ఇప్పించి అండగా నిలిచారు. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన కొల్లూరి అనిల్.. లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా లివర్ ప్లాంటేషన్‌కు రూ.2.50 లక్షల ఖర్చు అవుతుందని నిమ్స్ వైద్యులు చెప్పారని అనిల్ కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి అనిల్‌ను ఆదుకోవాలని అతని కుటుంబ సభ్యులు చీఫ్‌విప్‌ను వేడుకున్నారు. స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కార్యాలయంలో బాధితుడు కొల్లూరి అనిల్ తండ్రి స్వామికి చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ స్వయంగా అందించారు. అనిల్‌కు అండగా ఉంటానని మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ శివశంకర్ పాల్గొన్నారు.